ఫ్రీ లెఫ్ట్‌ను పట్టించుకోరు

- వాహనదారులు అన్ని వైపులా వస్తుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు
- ప్రయాణికుల కోసం ఫ్రీ లెఫ్ట్ మార్గాల్లో ఆటోవాలాల తిష్ట
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్న వాహనదారులు



ఫ్రీ లెఫ్ట్ విధానానికి అడ్డంకులు కల్పిస్తూ తిష్ట వేసిన ఆటోవాలాలు

కర్నూలు: ఎలాంటి ఇక్కట్లు లేకుండా సిగ్నల్ కూడళ్లలో వాహనాలు సులువుగా సాగేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రతిపాదించిన 'ఫ్రీ లెఫ్ట్' విధానం అమలులో విఫలమవుతోంది. సిగ్నల్స్ వద్ద ఎడమ వైపు వెళ్లే వారికి ఎరుపు సిగ్నల్‌తో పని లేకుండా నేరుగా వెళ్లేందుకు 'ఫ్రీ లెఫ్ట్' విధానాన్ని ట్రాఫిక్ పోలీసులు గతేడాది ఆగస్టులో తెరపైకి తెచ్చారు. దీంతో వాహనదారులు సులువుగా వెళ్లేలా సిగ్నల్స్ వద్ద సిమెంటు దిమ్మెలు, ఐరన్ బారికేడ్లు (డివైడర్లు) పెట్టి వాహనాలు ఆగకుండా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

కర్నూలు నగరంలో మొత్తం 16 సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. అధిక కూడళ్లలో ఎడమ వైపు వెళ్లేందుకు వీలు లేకుండా వాహనాలను నిలపడం, ఆటోవాలాలు తిష్ట వేయడంతో ఇబ్బందులు తలెత్తేవి. ఎడమ వైపు మార్గంలో వెళ్లాల్సిన వారు హారన్లు మోగించినా వాహనాలు ముందుకు కదలక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. కొన్ని సందర్భాల్లో అంబులెన్సులు కూడా ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కుని ముందుకు కదలని పరిస్థితి ఉండేది. మన్సూరుద్దీన్ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఫ్రీ లెఫ్ట్ విధానం అమలుపరిచారు. ఇందులో భాగంగా స్థానిక బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ సెంటర్‌లో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఆయా సర్కిళ్లలో ఎడమ వైపు వెళ్లేందుకు వీలు లేకుండా వాహనాలు నిలపడం, ఆటోవాలాలు దారి మొత్తం తిష్ట వేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎడమ వైపు మార్గంలో వెళ్లాల్సిన వారు హారన్లు మోగించినా వాహనదారులు ముందుకు కదలక ట్రాఫిక్ జామ్‌లు తలెత్తుతున్నాయి.

వాహనాలు అడ్డంగా నిలిపితే కేసులు

వాహనాలు ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే మోటార్ వాహన చట్టం కింద జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం. మొబైల్ క్యాంటీన్లు, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి. ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఫ్రీ లెఫ్ట్ మార్గంలో తిష్ట వేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించే విధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అన్ని వర్గాల వారు సహకరించాలి.

– మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ

నిబంధనలకు పాతర

ఫ్రీ లెఫ్ట్ విధానానికి కొన్ని రోజులు వాహనదారులు అలవాటు పడ్డారు. నేరుగా వెళ్లేవారు లెఫ్ట్ మార్గానికి ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. క్రమేణా ఫ్రీ లెఫ్ట్ మార్గంపై పోలీసులు దృష్టి సారించకపోవడంతో బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ కూడళ్లలో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. లెఫ్ట్ మార్గంలో వెళ్లేవారికి దారి ఇవ్వకుండా వాహనదారులు అన్నివైపులా పాకడంతో ఇబ్బందులు తిరిగి మొదలయ్యాయి. ముఖ్యంగా బళ్లారి చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ మార్గంలో ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ వైపు నుంచి హైదరాబాదుకు వెళ్లే మలుపు వద్ద ఆటోవాలాలు ఆటోలు నిలుపుకుని ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ప్రయత్నిస్తుండటంతో అటుగా వచ్చే వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కోడుమూరు వైపు నుంచి హైదరాబాదు వైపు వెళ్లే భారీ వాహనాలు, బస్టాండ్ నుంచి హైదరాబాదు వెళ్లే బస్సులు ఈ మార్గం గుండా వెళ్లేందుకు నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకు ప్రధాన కారణం అక్కడ ఎక్కువ సంఖ్యలో ఆటోలు, ట్యాక్సీలు నిలుపుతుండటంతో అపసవ్య దిశలో సర్వీస్ రోడ్డుపై వచ్చే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పక్కకు జరగాలని హారన్లు మోగించినా ఆటోవాలాలు జరగడం లేదు. కొందరు ఆటోవాలాలు ఘర్షణలకు దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఫ్రీ లెఫ్ట్ మార్గం తర్వాత మలుపు వద్ద ట్యాక్సీ వాలాలు మినీ బస్‌స్టాప్ అక్రమ పార్కింగ్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఆర్టీసీ డ్రైవర్లకు తలనొప్పిగా మారింది. కూతవేటు దూరంలోనే ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఉంది. నిత్యం ఆటోవాలాలకు, ఇతర వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తి ఘర్షణలు పడుతున్నా అటు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కానీ, ఇటువైపు ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది కానీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆటోవాలాలను కట్టడి చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

క్లుప్తంగా

హంద్రీ - నీవా ద్వారా సాగునీరివ్వాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): హంద్రీ – నీవా ద్వారా పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 23వ తేదీన నిర్వహించే బల ప్రదర్శనకు జిల్లా నుంచి వేలాదిగా హాజరు కావాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, పట్టణ కార్యదర్శి గిరి, సహాయ కార్యదర్శి చిన్నమాదులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వెల్లడించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

అర్జీ పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని తన స్వగృహంలో.. ఇటీవల తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన బి.విశ్వాసరావు (బంగారు పతకం, 65 కేజీలు) బి.చిరు చరణ్ తేజ (వెండి పతకం, 55 కేజీలు) బి.క్రిష్ణవంశీ (బ్లాక్ బెల్ట్)లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టీ.వెంకటేశ్వర్లు, కార్యదర్శి టీ.అజయ్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటండి



జోనల్ పోటీల్లో పాల్గొనే జిల్లా హాకీ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 18, 19 తేదీల్లో తిరుపతి పట్టణంలో నిర్వహించే జోనల్ స్థాయి హాకీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా హాకీ జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, కోచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ విద్యార్హతపై విచారణ

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న ఎస్.శామ్యూల్‌పాల్ విద్యార్హతపై పాఠశాల విద్య కమిషనర్ విజయ రామరాజు విచారణకు ఆదేశించినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ జనరల్ సెక్రటరీ ఎం.వి శేషఫణి రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న కడప ఆర్జేడీ శామ్యూల్‌ను కమిషనర్ ఆదేశించారన్నారు. గతేడాది జూన్ 5న పాఠశాల విద్యా కమిషనర్ జారీ చేసిన జాబితాలో డీఈఓలకు పదోన్నతులు కల్పించేందుకు అర్హులైన ఏడీల సీనియారిటీ జాబితాలో శామ్యూల్ పాల్ విద్యార్హతలో బీఏ అని మాత్రమే ఉందని, 24 అక్టోబరు 2024న ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ. ఆర్.టీ నంబరు 433లో బీఈడీ అర్హతతో డీఈఓగా పదోన్నతి పొందారన్నారు. దీనిపై వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో ఆర్జేడీని విచారణ అధికారిగా నియమించి, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు.

సాహిత్యంలో విశిష్టమైనది తెలుగు కథ



ప్రశంసా పత్రం అందిస్తున్న చంద్రశేఖర కల్కూర

కర్నూలు కల్చరల్: భారతీయ సాహిత్యంలో తెలుగు కథ వైశిష్ట్యమైనదని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 75 సంవత్సరాల (1947–2022) తెలుగు చిన్న కథలు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల, విప్లవ కథలపై కె.నాగేశ్వరాచారి, మైనార్టీ, స్త్రీవాద కథలపై ఎస్.ఎండీ ఇనాయతుల్లా, దళిత, బహుజన, గిరిజన కథలపై జి.వెంకటకృష్ణ, ప్రాంతీయ కథలపై మారుతి పౌరోహితం ప్రసంగించారు. ఈ 75 సంవత్సరాల్లో తెలుగు కథ ల్లో అనేక మార్పులు, పరిణామాలు వచ్చా యన్నారు. ఇవి సమాజాన్ని తీవ్ర ప్రభావితం చేశాయన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ సాహిత్య అకాడమీ దేశవ్యాప్తంగా భాషా సాహిత్యాలకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమ ంలో రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా కార్యదర్శి చక్రపాణి యాదవ్, సాహితీ వేత్తలు, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

కర్నూలు(సెంట్రల్): సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, వారి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏపీయూడబ్ల్యూజే 69వ వార్షికోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు అధ్యక్షతన వెంకటరమణ కాలనీలోని కీర్తన అనాథాశ్రమంలో నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు ఎన్వీ సుబ్బయ్య జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే చిన్నారులతో కేక్ కట్ చేయించి వారికి తినిపించారు. చిన్నారులకు స్వయంగా భోజనం వడ్డించారు. వారు మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలపై ప్రజలను సంఘటితం చేయాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందన్నారు. శాశ్వత ప్రతిపాదికన ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జగన్నాథగట్టు వద్ద జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాల్లో రోడ్లు, మౌలిక సౌకర్యాల సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. చాలామంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేవని, ప్రభుత్వం జీఓ ఇచ్చిన వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యుడు కె.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోషక లోపాలను నివారిస్తేనే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతకుమారి

కర్నూలు(అగ్రికల్చర్): ఆయా పంటల్లో పోషక లోపాలను సకాలంలో నివారిస్తేనే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందని కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కాలేజీ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ శాంతకుమారి పేర్కొన్నారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి హాజరై సూక్ష్మ పోషకాలను గుర్తించడం ఎలా?.. నివారించకుకునేందుకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పత్తి ఎక్కువగా సాగైందని, పత్తితో పాటు వేరుశనగలో మెగ్నీషియం, జింక్, ఇనుపధాతు లోపాలు కనిపిస్తున్నాయని చెప్పారు. భాస్వరం ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల ఈ పోషకాల లోపాలు వస్తాయని పేర్కొన్నారు. మెగ్నీషియం లోపం వల్ల ఆకులు ముదురు ఎరుపు రంగులోకి మారి ముడుచుకుంటాయని, ఈ లోపం నివారణకు మెగ్నీషియం సల్ఫేటు ఒక లీటరు నీటికి 10 గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. వివిధ పోషక లోపాల లక్షణాలు, నివారణ పద్ధతులపై ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పించారు. విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త జయచంద్ర మాట్లాడారు. పలువురు ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

రోడ్లను బాగు చేయండి



శిథిలమైన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో రహదారులు శిథిలమైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.రాముడు విమర్శించారు. ఆదివారం నగరంలో దెబ్బతిన్న రహదారులను సీపీఎం బృందం పరిశీలించింది. సుందరయ్య సర్కిల్‌లోని నవయుగ హోటల్ సమీపంలో రోడ్డు ఛిద్రమై ఉండటాన్ని చూసి ప్రధాన రహదారిని కూడా బాగుచేయకపోవడం అన్యాయమన్నారు. రహదారులను బాగు చేస్తామని చెప్పి వచ్చిన నిధులను అధికారులు, కూటమి నేతలు పంచుకొని నాసిరకంగా నిర్మించడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు చలపతి, పీఎస్ రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, గురుశేఖర్, ప్రభాకర్, యేసురాజు పాల్గొన్నారు.

ముగిసిన రోజా దర్గా ఉరుసు



కిస్తీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలోని దర్గా వీధిలో వెలసిన సయ్యద్ గరీబ్ వలీ దాదా రహంతుల్లా దర్గాలో మూడు రోజులుగా జరుగుతున్న ఉరుసు ఉత్సవాలు ఆదివారం మధ్యాహ్నం ఫజులుల్లా ఖాద్రి మత పెద్దల ఆధ్వర్యంలో జియారత్ ఫాతేహాల్ కార్యక్రమంతో ముగిశాయి. ఉరుసులో భాగంగా నిర్వహించే కిస్తీ కార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సావాలను తిలకించేందుకు వచ్చిన ప్రజలతో దర్గా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. దర్గా ప్రధాన వీధిలో పిల్లల ఆటల సామగ్రి, గాజులు, మహిళ అలంకరణ సామగ్రి, మిఠాయిల అంగళ్లు తదితర అన్ని దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు మత సామరస్యంగా ఉరుసును జరుపుకున్నారు.



రహంతుల్లా దర్గా వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు

ఇస్కాన్‌లో వ్యాస పూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద వారి 129వ వ్యాసపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్శన హారతి, స్వామివారికి మహా శంఖాభిషేకం, మహా హారతి, పుష్పాంజలి, శ్రీల ప్రభుపాద వారి ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు వైష్ణో చైతన్య ప్రభు, ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు సందేశమిచ్చారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ వ్యాస పూజలో పాల్గొని పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పుస్తకాలపై నిషేధం తగదు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్: పుస్తకాలపై నిషేధం భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీక్యాంప్‌లో పలువురు కవులు, రచయితలు ప్లకార్డులు పట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రత్నం ఏసేపు మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ప్రసిద్ధ రచయితలు రచించిన 25 పుస్తకాలను నిషేధిస్తూ ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వాటిల్లో సుప్రసిద్ధ రచయితలు అరుంధతీరాయ్, ఏసీ నురాని, సుమంత్ర బోస్, సీమా ఖాజీ, డేవిడ్ దేవదాస్ వంటి వారు రచించిన పాపులర్ గ్రంథాలు ఉన్నాయన్నారు. అవన్నీ కశ్మీర్ చరిత్ర, అక్కడ జరుగుతున్న వాస్తవ విషయాలను తెలియజేసే గ్రంథాలన్నారు. వాటిని నిషేధించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మేధావులపై, వారి ఆలోచనలపై నిషేధం విధించినట్లైందన్నారు. ఈ చర్య రాజ్యాంగం ప్రకటించిన భావ ప్రకటన స్వేచ్ఛకు భంగకరమన్నారు. తక్షణమే ఆ పుస్తకాలపై నిషేధం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వాలి



మాట్లాడుతున్న వి.రాంభూపాల్

కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలన్నారు. వెనుకబడిన కర్నూలు అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 44లో కేంద్రం స్పష్టంగా వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని చెప్పినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. దీంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు ఇప్పటికీ వెనుకబడి ఉన్నాయని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు ఎండీ ఆనంద్ బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

'బుష్'లు కొడుతున్న ప్రమాదం



జెడ్పీ భవనం పక్కనే ఏపుగా పెరిగిన గడ్డి



మీటింగ్ హాల్ వెనుక నిరుపయోగంగా ఉన్న మూత్రశాల



దుర్వాసన కొడుతున్న మీటింగ్ హాల్ వెనుకభాగం



జెడ్పీ ముందుభాగంలో ఉన్న పార్కులో పెరిగిన గడ్డి

- హడలిపోతున్న జెడ్పీ ఉద్యోగులు

జిల్లా పరిషత్ పరిపాలనా భవనం చూడ్డానికి చాలా అందంగా ఉంది. పరిసరాలు కూడా పచ్చగా చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. కానీ ... ఈ పరిసరాల్లో తిరుగాడాలంటే ఉద్యోగులు హడలి పోతున్నారు. ఏపుగా పెరిగిన పచ్చని గడ్డి వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం వల్ల పాములు స్వైర విహారం చేస్తున్నాయి. కనీసం ఆరు అడుగుల పొడవు ఉన్న నాగు పాము ఈ గడ్డిలోనే సంచరిస్తున్నట్లు చూసిన ఉద్యోగులే చెబుతున్నారు. పట్టపగలే పాములు సంచరిస్తుండడం వల్ల ఉద్యోగులు భయం భయంతో కార్యాలయంలోకి వెళ్తున్నారు. జెడ్పీ భవనం ముందు భాగాన ఉన్న పార్కులో పచ్చని గడ్డి ఆహ్లాదంగా ఉన్నా, పాముల భయంతో అక్కడ కూర్చునే సాహసం ఎవరూ చేయడం లేదు. విద్యుత్ టవర్లను పచ్చదనం పొదళ్లు అల్లుకుపోయి మరింత భయపెడుతున్నాయి. జెడ్పీ భవనం పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయింది. అలాగే జెడ్పీ సమావేశ భవనాన్ని నిర్మించిన మూత్రశాల నిరుపయోగంగా ఉండడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా తయారైంది. ఎవరు ఈ మూత్రశాల లోకి వెళ్లకుండా కంప అడ్డుగా పెట్టడం వల్ల, మీటింగ్ హాల్ వెనుక భాగంలో జెడ్పీలోకి వచ్చే వారంతా దాదాపు అక్కడే మూత్ర విసర్జన చేస్తుండడం వల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసన కొడుతోంది.

– కర్నూలు(అర్బన్)

మొరాయించిన ఆర్టీసీ బస్సు



సి.బెళగల్‌లో బురదలో దిగి బస్సును తోస్తున్న ప్రయాణికులు

సి.బెళగల్: మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో వాహనదారులు, ప్రమాణికులు నిత్యం పలువురు అవస్థలు పడుతున్నారు. సి.బెళగల్‌లోని ఎమ్మిగనూరు – గూడూరు ప్రధాన రోడ్డులో ఇటీవల వర్షాలకు నీటి మడుగులు ఏర్పడి వాహనాల రాకపోకలతో బురదమయంగా మారింది. ఈ స్థితిలో ఆదివారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 21 జెడ్ 0747 బస్సు ప్రయాణికులతో గూడూరు నుంచి ఎమ్మిగనూరుకు వస్తూ మండల కాంప్లెక్స్ వద్ద ఒక్కసారిగా నిలిచిపోయించి. బస్సు బురదలో నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు బస్సును తోయక తప్పలేదు. బురదలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మరమ్మతుల అనంతరం బస్సు ఎమ్మిగనూరుకు వెళ్లిపోయింది. కాగా రోడ్డు దుస్థితి, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.